
చిప్పల్‌తుర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ సంధ్యారాణి


మాసాయిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ జ్ఞానజ్యోతి

# దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దు

**• కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి: ఏడీఏ సంధ్యారాణి**

నర్సాపూర్/వెల్దుర్తి, అక్టోబర్ 31: తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ సంధ్యారాణి సూచించారు. మంగళవారం మండలంలోని చిప్పల్‌తుర్తి, కాగజ్‌మద్దూర్, పెద్దచింతకుంట గ్రామాల్లో 'ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏడీఏ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్ధతు ధరను పొందాలని తెలిపారు. ధాన్యం విక్రయించిన అనంతరం సకాలంలోనే డబ్బులను రైతుల బ్యాంక్ ఖాతలో వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం హరికృష్ణ, ఏవో అనిల్‌కుమార్, ఏఈవోలు తేజస్వినీ, పీఏసీఎస్ సీఈవో వెంకటస్వామి, సిబ్బంది శ్రీనివాస్, భరత్ రైతులు పాల్గొన్నారు.

### రైతులను ఆదుకోవడానికే కొనుగోలు కేంద్రాలు

మద్దతు ధర అందించి రైతులను ఆదుకోవడం కోసం ప్రభుత్వం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని మాసాయిపేట తహసీల్దార్ జ్ఞానజ్యోతి అన్నారు. మంగళవారం మాసాయిపేటతో పాటు మండలంలోని కొప్పులపల్లి, నాగ్సాన్‌పల్లి, ఐకేపీ ఆధ్వర్యంలో బొమ్మారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏవో రాజశేఖర్, ఏఈవో రజిత, సొసైటీ సీఈవో సిద్ధయ్యలతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమాలలో సొసైటీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

రామాయంపేట, అక్టోబర్ 31: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కళాజాత కో ఆర్డినేటర్ రామారావు, మున్సిపల్ అధికారి వడ్డెపల్లి శ్రీనువాస్, టీం లీడర్ బిట్ల ఎల్లం పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేట పట్టణంలోని బస్టాండ్, మెదక్ చౌరస్తా, ప్రభుత్వ దవాఖాన వద్ద కళాజాత ఆటపాటలతో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తు ప్రతి ఊరిలో అవగాహన కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆయన వెల్లడించారు.

## బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

రామాయంపేట, అక్టోబర్ 31: కాట్రియాల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని గ్రామ సర్పంచ్ శ్యాములు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మైలారం బసవయ్య మంగళవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో మెదక్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి తీరుతామన్నారు. అనంతరం గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీ చేపట్టారు.

## చోరీకి గురైన సెల్‌ఫోన్ అందజేత

రామాయంపేట, అక్టోబర్ 31: నెల రోజుల క్రితం రామాయంపేట పట్టణంలోని కేసీఆర్ కాలనీ వద్ద ఓ అగంతకుడు కాలినడకన వెళ్తున్న మహిళపై దాడిచేసి పర్సులను అందులో ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగిలించాడు. వెంటనే బాధితురాలు బాలమణి రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ద్వారా ఫోన్ అడ్రస్ తెలుసుకుని సంబంధిత అగంతకుడి నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకని, మంగళవారం బాధితురాలు బాలమణిని స్టేషన్‌కు పిలిచి ఉమెన్ ఎస్సై.జ్యోతి ఫోన్‌ను అందజేశారు. బాధితురాలు బాలమణి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రైలు కిందపడి హమాలీ ఆత్మహత్య

చేగుంట, అక్టోబర్ 31: హమాలీ కార్మికుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం రైల్వేస్టేషన్‌లో మంగళవారం జరిగింది. కామారెడ్డి రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. చేగుంట మండల కేంద్రానికి చెందిన బక్కోళ్ల అంజయ్య(53)హమాలీ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో గొడవ పడి మనస్తాపంతో సికింద్రాబాద్ నుంచి మన్మాడ్ వైపు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్‌కు ఎదురుగా వెళ్లి అంజయ్య ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య వరలక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు.

## ఓటు ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ

చేగుంట, అక్టోబర్ 31: రామాయంపేట ఐసీడీఎస్, చేగుంట సెక్టార్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు పాఠశాల విద్యార్థులతో చేగుంటలో మంగళవారం ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటర్లు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేపించారు.


కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

## సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు

మనోహరాబాద్, అక్టోబర్ 31: సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నేతలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మనోహరాబాద్ మండంల కాళ్లకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఐఎన్టీయూసీ అసెంబ్లీ అధ్యక్షుడు ఏశం నాగరాజు యాదవ్, ఎస్సీ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, భరత్ యాదవ్, నాయకులు రఘు, మహేశ్, సాయికుమార్, మల్లికార్జున్, హరికృష్ణ, భరత్‌రెడ్డి, సంతోశ్ తదితరులు కాంగ్రెస్ పార్టీని వీడి ఎంపీపీ పురం నవనీత రవి ముదిరాజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆకలికేకల తెలంగాణను అన్నపూర్ణగా మార్చి దేశానికే అన్నంపెట్టే రాష్ట్రంగా సీఎం కేసీఆర్ తీర్చిదిద్దాదరన్నారు. 24 గంటల ఉచిత విద్యుత్, పెట్టుబడి సాయం, రైతుబీమా వంటి పథకాలతో పాటు మార్కెట్ రంగాన్ని అభివృద్ధి చేయడంతో నేడు రాష్ట్రంలో వ్యవసాయరంగం అభివృద్ధి చెందిందన్నారు. సీఎం కేసీఆర్‌కు రైతులు, ప్రజల అండదండలు ఉన్నాయని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని వంటేరు ధీమా వ్యక్తం చేశారు.

## దుండగుడిని శిక్షించాలి


మాట్లాడుతున్న చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్

రామాయంపేట, అక్టోబర్ 31: మెదక్ ఎంపీ, దుబ్బాక నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడికి పాల్పడ్డ నిందితుడిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని రామాయంపేట పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం రామాయంపేట పట్టణంలోని పార్టీ పిలుపు మేరకు మహంకాళి ఆలయంలో అమ్మవారికి పూజలు చేసి విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు అడిగే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, కావాలనే ఓ వ్యక్తి ఓ పార్టీ అండతో ఒక మంచి మనిషిపై ప్రచారం చేస్తుండగా కత్తితో దాడికి పాల్పడడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గజవాడ నాగరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, పురపాలిక వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, పురపాలిక కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## సునీతారెడ్డి విజయానికి సైనికుల్లా పనిచేయాలి


కొల్చారం: మాట్లాడుతున్న సురేశ్‌గౌడ్

కొల్చారం, అక్టోబర్ 31: నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి విజయానికి యువత సైనికుల్లా పనిచేయాలని కొల్చారం మండల బీఆర్ఎస్ విద్యార్థి విభాగం మండలాధ్యక్షుడు సురేశ్‌గౌడ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఆరె రవీందర్, చిన్నాఘన్‌పూర్ సొసైటీ వైస్‌చైర్మన్ పిల్లెల రాజు పిలుపునిచ్చారు. కొల్చారం మండలంలో మంగళవారం మండల బీఆర్ఎస్ యువత సమావేశం ఏర్పాటు చేశారు. ఉద్యమ సమయంలో కొల్చారం మండల యువకులు చురకుగా ఉద్యమం చేశారని గుర్తు చేశారు. ప్రతి ఒక్క యువకుడు ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకుపోవాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు బైకరి శ్రీకాంత్, దేవన్నగారి ప్రశాంత్, అన్వేష్ గౌడ్, వివిధ గ్రామాల యూత్ అధ్యక్షుడు మహేశ్, కరుణాకర్, అంబు, ఆరే శివాజీ, నాగరాజుగౌడ్, మహేశ్ గౌడ్, ఎరుకల ప్రశాంత్, ధర్మవీర్‌గౌడ్, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.


నర్సాపూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రమేశ్

## ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చర్యలు

నర్సాపూర్, అక్టోబర్ 31: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రమేశ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నర్సాపూర్ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించి టాయిలెట్స్, విద్యుత్, తాగునీటి సరఫరా ఇతర సౌకర్యాలను ఆయన పరిశీలించారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చేత నిర్వహించిన మాక్ పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాధాకిషన్ రావు, మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ స్వామి దాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం

చిలిపిచెడ్, అక్టోబర్ 31: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్ అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కిషన్‌రెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 24 గంటల నిరంతర విద్యుత్‌తో పాటు పలు సంక్షేమ పథకాలు బీఆర్ఎస్‌ను మూడోసారి అధికారంలోకి రావడానికి దోపదపడుతాయన్నారు.

## వరి పంటకోత ప్రయోగం

చిలిపిచెడ్, అక్టోబర్ 31: వరి పంట దిగుబడి ఎంత వరకు వస్తుందో తెలుసుకోవడం కోసమే సంయుక్తంగా వరి పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ తెలిపారు. మంగళవారం మండలంలోని బండపోతుగల్ గ్రామంలో రైతు షఫియోద్దీన్ పొలంలో నిర్వహించిన పంటకోత ప్రయోగంను మండల ప్రణాళిక గణాంక అధికారి వెంకటేశంతో కలిసి ప్రయోగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ సాగు చేసిన వరి పంటను గుంట భూమిలో ఐదు మీటర్లు పొడువు, ఐదు మీటర్లు వెడల్పు పంటను కొలతలు వేసి వరి కోసి, వచ్చిన ధాన్యాన్ని అక్కడే తూకం వేస్తామన్నారు. ఈ విధమైన వరి పంటకోత ప్రయోగంతోనే సరైన గణాంకాలు తెలుసుకోవచ్చున్నారు. ఈ రైతు వరి పొలంలో ప్రయోగం నిర్వహించగా దిగుబడి 12.930 కేజీలు వచ్చిందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి, ఏఈవో భూపాల్, రైతులు బాలయ్య, సాయిబాబా, పాపయ్య పాల్గొన్నారు.

## బీజేపీ సభకు అసమ్మతుల గైర్హాజరు

నర్సాపూర్, అక్టోబర్31: నర్సాపూర్ పట్టణంలోని సాయికృష్ణ గార్డెన్‌లో బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జోనల్ ఇన్‌చార్జి బెల్గాం ఎమ్మెల్యే అభయ్ పాటిల్, ఎమ్మెల్యే రఘునందన్‌రావు వస్తున్నారని ప్రచారం జరిగింది. టికెట్ ఆశించి భంగపడ్డ బీజేపీ రాష్ట్ర నాయకులు సింగాయిపల్లి గోపి, రఘువీర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్ సభకు మొఖం చాటేశారు. ఈ సభకు జోనల్ ఇన్‌చార్జి ఎమ్మెల్యేలు అభయ్ పాటిల్, రఘునందర్‌రావు రాకపోవడం గమనార్హం. బీజేపీ అభ్యర్థిని అధిష్టానం ప్రకటించడంతో గత కొన్ని రోజులుగా అసమ్మతి నేతలు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.

## మహిళ ఆత్మహత్య

చేగుంట, అక్టోబర్ 31: చెరువులో దూకి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం రెడ్డిపల్లిలో జరిగింది. చేగుంట పోలీసులు కథనం ప్రకారం.. మక్కరాజిపేటకు చెందిన లావణ్యను రెడ్డిపల్లి గ్రామానికి చెందిన తలారి చిన్నముత్యంతో నాలుగేండ్ల క్రితం వివాహం జరిగింది. సోమవారం వరి పంటను కోస్తున్న సమయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో మనస్తాపం చెందిన లావణ్య సమీపంలోని రెడ్డిల చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతిరాలికి రెండేళ్ల కూతురు, 5 నెలల కుమారుడు ఉన్నారు. కాగా, మా కూతురుది ఆత్మహత్యకాదని, అత్త, భర్త హత్య చేసి చెరువులో పడేశారని లావణ్య తల్లిదండ్రులు కలమ్మ సత్తయ్య ఆరోపించారు. మృతిరాలి బంధువుల ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఏరియా దవాఖానకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.